## కన్నుల పండగగా గోదా శ్రీనివాస కల్యాణ మహోత్సవం...వైభవంగా తెప్పోత్సవం

చీమకుర్తి, జనవరి 14, ప్రభాతవార్త




చీమకుర్తి మండలం కాండూరి వారి అగ్రహారంలో వేంచేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు బుధవారం వేడుకగా జరిగాయి. భోగి పండగ ను పురస్కరించుకొని గోదా శ్రీనివాస కళ్యాణం కన్నుల పండగగా జరిగింది. బెంగుళూర్ బెంగళూరు నుంచితెప్పించినప్రత్యేక పూలతో అలంకరణ చేపట్టారు. ప్రధానార్చకులు వెంకటేశ్వరాచార్యులు స్థానాచార్యులు శ్రీమాన్ పంచాంగం రామానూజాచార్యస్వామి వారు మరోముగ్గురు వారి శిష్య బృందం వేదమంత్రాలతో శిద్దా వెంకటేశ్వర రావు దంపతులు, ప్రపంచ ఆర్యవైశ్య వాసవి క్లబ్ సముదాయ అధ్యక్షులు శిద్దాసూర్యప్రకాశరావు దంపతులు, శిద్దా హనుమంతరావు దంపతులు, శిద్దా భరత్ బాబు దంపతులు కొప్పురావూరి ఉదయ్ దంపతులు, శ్రీరామ మూర్తి దంపతులు, పోలిశెట్టి ప్రభాకర్ దంపతులు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తుల దంపతులుఅందరూ సామూహిక కళ్యాణంలో పాల్గొన్నారు. కృష్ణ సాయి, ఆపిల్ గ్రూప్స్ మరియు కాండూరి రవి రామానుజచార్యులు కోట బాలకృష్ణ రావు కొనిజెటి సుబ్బారావు పబ్బిశెట్టి శ్రీనివాస రావు గుర్రం హరి ట్రస్ట్ ఆధ్వర్యంలోజరిగింది. కన్నుల పండగ శ్రీవారి తెప్పోత్సవం: ఆలయ జీర్ణోద్ధరణ కైంకర్యపోషకులు సిద్ధ కుటుంబీకుల సారథ్యంలో కాండూరి వారి అగ్రహారం ఆలయం పక్కనే ఉన్న చెరువులో బుధవారం రాత్రి శ్రీవారి తెప్పోత్సవమును కన్నుల పండగ నిర్వహించారు. ప్రత్యేకంగా రప్పించిన పడవలపై పూలు విద్యుత్తు లైట్ల అలంకారంతో శోభాయమానంగా తయారు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా చెరువు ఒడ్డున ఉన్న పడవ వద్దకు తీసుకువచ్చారు. మహిళలు కోలాటాలతో స్వామి ఊరేగింపుకు ఆకర్షణగా నిలిచారు. సాంస్కృతిక కార్యక్రమాల మధ్య శిద్దా కుటుంబీకులు వెంకటేశ్వరరావు, సూర్యప్రకాశరావు, హనుమంతరావు, భరత్ వారి కుటుంబ సభ్యులతో తెప్పోత్సవంలో పాల్గొన్నారు. తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ చే బియ్యము నిత్యవసర వస్తువులు పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త



సూర్య శ్రీ దివ్యంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ సర్దార్ బాషా షహనాజ్ ఆధ్వర్యంలో ఒంగోలు కర్నూల్ లోని ట్రస్టు కార్యాలయం ఆవరణలో సంక్రాంతి సందర్భంగా పేదలకు బియ్యము నిత్యవసరం వస్తువులు ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఆధారం లేని పేదలకు సంక్రాంతి పండగ ఆనందంగా జరుపుకోవాలని వారి కళ్ళల్లో ఆనందం చూడాలని నిరంతరం పేదవారికి అవసరాలు తీర్చే దిశగా సూర్య శ్రీ ట్రస్ట్ పనిచేస్తుందని తెలిపారు. ట్రస్ట్ సెక్రెటరీ ఎస్కేసర్దార్ భాష మాట్లాడుతూ గత ఏడు సంవత్సరం నుంచి ట్రస్టు ఆధ్వర్యంలో నిస్సహాయిలైన పేదలకు ట్రస్ట్ అండగా ఉండి ఆర్థిక సాయం అందిస్తున్నామని పేదలు కూడా సంక్రాంతి పిండి వంటలతో సంతోషంగా జరుపుకోవాలని దాతల సహకారంతో ఈరోజు వందమందికి లక్ష యాభై వేలు విలువగల నిత్య అవసరాల సరుకులు అందించామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ట్రస్టు సభ్యులు మండవ సుబ్బారావు, మేడిశెట్టి సుబ్బారావు, నేరెళ్ల శ్రీనివాసరావు, గొల్లపూడి రవి, డాక్టర్ ఏడుకొండలు, బొడ్డపాటి వెంకట్ ట్రస్టులోని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలలో విజేతలకు మారం బహుమతులు

చీమకుర్తి, జనవరి 14, ప్రభాతవార్త




చీమకుర్తి మండలం గాంధీనగర్‌లో మారం వెంకారెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో వరుసగా 8వ సంవత్సరం ఆనందోత్సాహాల మధ్య బుధవారంనిర్వహించారు. ప్రతి సంవత్సరం సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న ఈ కార్యక్రమం ఈ సంవత్సరం కూడా ప్రజల విశేష ఆదరణతో విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించబడాయి. ఈ కార్యక్రమములో భాగంగా ముఖ్య అతిథి ఎం వి ఆర్ గ్రూప్ అధినేత, ఏఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమములో పాల్గొన్న ప్రతి ఒక్క రికి సంక్రాంతి మరియు భోగి శుభాకాంక్షలు తెలియజేసి ఇంకా భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆశించారు. ఈ ముగ్గులపోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమములో గోపిరెడ్డి సుధీర్ రెడ్డి, పోకూరి రామకృష్ణా రెడ్డి, చింతక్రింది అశోక్, నారాయణ చిరంజీవి, ఆలపాటి నరసింహా రావు , పులకం కోటిరెడ్డి, కోటా రాములు (ఆర్గనైజర్ ) మరియు మారం వెంకారెడ్డి అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయటం జరిగింది. మొదటి బహుమతి ప్రవీణ(ఫ్రిడ్జ్), రెండవ బహుమతి గోలి లక్ష్మీ (వాషింగ్ మెషిన్), మూడవ బహుమతి గుండా భారతి (డ్రెస్సింగ్ టేబుల్).

## ఘనంగా ఎన్నారై తారా శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గులు, ఆటల పోటీలు

- విజేతలకు ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ గ్రైండర్లు పంపిణీ

సంతనూతలపాడు, జనవరి 14, ప్రభాతవార్త



సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామంలో ఎన్నారై తారా శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి లో ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో విజేతలైన చీమకుర్తి మండలం గోనుగుంట గ్రామానికి చెందిన దర్శి పద్మిని ప్రథమ స్థానం సాధించింది. గుంటూరు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన మహిళ ద్వితీయ స్థానం సాధించింది. సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు గ్రామానికి చెందిన శామంతపూడి శిరీష తృతీయ స్థానం సాధించింది. విజేతలైన వీరికి డబల్ డోర్ ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, గ్రైండర్లు, ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి కన్సలైజేషన్ బహుమతులను ఎన్నారై తారా శ్రీ ఫౌండేషన్ బృందం ఈ సందర్భంగా పంపిణీ చేశారు. సంతనూతలపాడు మండలం ఎనికపాడు హైస్కూల్లో ఈ ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా గ్రామంలో ఒక పండుగ వాతావరణంలో వీటిని నిర్వహించారు. ఆటల పోటీల్లో పాల్గొన్న యువకులకు బహుమతులు పంపిణీ చేశారు. ఎన్నారై తారా శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. ఎనికపాడు హైస్కూల్లో విద్యార్థులు ఆడుకునేందుకు గాను మంచి గ్రౌండ్‌ను ట్రస్టు ఆధ్వ ర్యంలో చేపట్టారు. అంతే కాకుండా ఎన్నారై తారా శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ ఆడిటోరియంను నిర్మించారు. తన స్వగ్రామమైన ఎనికపాడులో అదే విధంగా తాను చదువుకున్న హైస్కూల్ అభ్యున్నతకు ఎన్నారై తారా శ్రీ ఫౌండేషన్ ఫౌండర్ విక్రమ్ తారాబాయ్ ప్రత్యేకంగా నడుం బిగించారు. ఎన్నారై తారా శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు నడుంబిగించారు.






ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



### సంక్రాంతిలో భాగంగా మహిళలు, చిన్నారులచే ఆకట్టుకున్న ముగ్గులు

సంతనూతలపాడు, జనవరి 14, ప్రభాతవార్త

సంక్రాంతిలో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో వారి గృహాల ముందు బుధవారం నాడు భోగిని పురష్కరించుకుని మహిళలు, చిన్నారులు విశిష్టంగా ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా భోగి పండుగలో భాగంగా ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడులోని పెద్ద బజారు నందు శిఘాకొల్లి సాయి శ్రీ నిఖిల అనే విద్యార్థి వేసిన భోగి ముగ్గు పలువురిని ఆకట్టుకుంది.



# నేతల ఇళ్ల వద్ద భోగి సంబరాలు

- కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేసిన రాష్ట్ర మంత్రి డోలా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, మాజీ మంత్రి శిద్దా





ఒంగోలు, ప్రభాతవార్త

మన తరువాతి తరాలకు ఆచార, సాంప్రదాయాలను చేరవేసే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి కోరారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం నాయుడుపాలెం తన నివాసం వద్ద కుటుంబ సభ్యుల తో కలిసి బుధవారం ఉదయం ఆయన భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాం క్షలు తెలిపారు. భోగి అందరికి భోగభాగ్యాలు అందించాలని ఆకాంక్షించారు. ఒంగోలు నగరంలోని మినిస్టేడియం నందు డీజేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలు సందర్భంగా మహాభోగి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు కుటుంబ సమేతంగా పాల్గొని భోగి పండుగ సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి టీడీపీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని భోగి మంటలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ప్రజలం దరితో కలిసి భోగి మంటల్లో పాల్గొనడం ఎంతో శుభసూచికం అన్నారు. తెలుగు ప్రజలందరికి భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి ప్రజలందరి కుటుంబాల్లో సుఖసంతోషాలు నింపాలని, వెలుగుల జీవితాలను ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి పల్లెల్లో సంక్రాంతి శోభ మెండుగా కనిపిస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఇంటా సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పాటుతో విద్య, వైద్యం, ఉపాధి పరిశ్రమలు ఇలా అన్నింటా మెరుగైన వృద్ధి సాధిస్తున్నామని దామచర్ల పేర్కొన్నారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఇంటి వద్ద భోగి మంటలను కుటుంబ సభ్యుల సమక్షంలో భోగి మంటలు వేశారు. ఈ సందర్భం గా శిద్దా రాఘవరావు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. భోగిఅందరికి భోగభాగ్యాలు అందించాలని ఆకాంక్షించారు. మన ఆచార్య సాంప్ర దాయాలను రాబోయే తరం వారికి కూడా చేరవేసే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల నాయకుల ఇళ్ల వద్ద కూడా భోగి మంటలు వేశారు. జిల్లా కలెక్టర్ నివాసంలో కూడా కుటుంబ సభ్యులతో భోగి మంటలు వేశారు. జిల్లా ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నివాస గృహంలో ఆయన కుటుంబ సభ్యులు భోగి మంటలు వేశారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ క్రమశిక్షణ పోటీతత్వం కృషి పట్టుదలతో కృషి చేస్తేనే మంచి ఫలితాలు

- కిస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి నాగేశ్వరరావు

జె. పంగులూరు, జనవరి 14, ప్రభాతవార్త

విద్యార్థులు దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేది ఉపాధ్యాయులే, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను ఏకాగ్రతతో విని అవగాహన చేసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కిస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సోమేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా కిస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరు నాగేశ్వరావు పాల్గొనన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో విన్న పాఠాలను విద్యార్థులు గ్రూపు డిస్కషన్ ద్వారా జ్ఞాపకశక్తిని పెంపొందించుకొని మంచి ఫలితాలు సాధిస్తారని, విద్యార్థులలో క్రమశిక్షణ, పోటీ తత్వం, కృషి పట్టుదలతో చదివినప్పుడే ఉత్తీర్ణతశాతం పెరుగుతుందన్నారు. దీంతో పాటు ఆటలోను, పాటలలో ను, అన్ని రంగాలలోనూ దీటుగా రాణించాలని అన్నారు. గత సంవత్సరంలో ఉత్తీర్ణశాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలన్నారు. గత సంవత్సరం మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో బాలురలో ప్రథమ స్థానం సాధించిన శాంతి కార్తీక్, బాలికలలో ప్రథమ స్థానం సాధించిన సబ్బసాని వైష్ణవి, మెట్టెల భార్గవాంజలి లకు కిస్ విద్యా సంస్థల చైర్మన్ నిడమానూరి నాగేశ్వరావు 20వేల రూపాయలు నగదు బహుమతులు అందజేశారు. తల్లపనేని రాణి 3,348 రూపాయలు, చిలుకూరి చిన్నమ్మ 2, 216 రూపాయలు, పావులూరి శ్రీనివాసరావు 1116 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమములో బాచిన చెంచు ప్రసాద్, కొండ్రగుంట బుచ్చయ్య చౌదరి, రాయిని రామారావు, బండారుపల్లి రమేష్ బాబు, బాలిన రామా సుబ్బారావు, బత్తుల వీరనారాయణ , పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షు కార్యదర్శులు బాచిన పూర్ణచంద్రరావు తలపనేని రామాంజనేయులు, సభ్యులు, పూర్వ విద్యార్థులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## హరిహర క్షేత్రంలో గోదా రంగనాయక స్వామి కల్యాణం

- కళ్యాణ వేడుకలలో పాల్గొన్న మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సుధీర్ కుమార్,ఉభయ దాతలు గోవింద నామ స్మరణతో తరించిన భక్త జనసందోహం

చీమకుర్తి, జనవరి 14, ప్రభాతవార్త




ధనుర్మాసం సందర్భంగా చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో బుధవారం మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి, మన్యం ఫణి కుమార్ దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు,శిద్దా కాశీ దంపతులు శిద్దా సురేష్ దంపతులు,చీమకుర్తి నగరానికి చెందిన ఉభయ దాతలు శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి వారి తిరు కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు దంపతులు శిద్దా సుధీర్ కుమార్ స్వామి వారికి,అమ్మవారికి పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ధనుర్మాసం పునస్కరించుకొని శ్రీ హరిహర క్షేత్రంలో ప్రాతఃకాలంలో పంచ కలశ స్థాపన,30 వ పాశురం సమర్పణ, అలంకరణ నిర్వహించారు. అనంతరం కల్యాణ ఘట్టంలో స్వామి వారికి సభా ప్రార్ధన,విష్వక్సేణ ఆరాధన,పుణ్యాహవచనం, రక్షాబంధన్, యజ్ఞోపవేతమ్, సమర్పణ,స్వామి వారికి అమ్మవారికి మధుపర్కాల సమర్పణ,మహా సంకల్పం, కన్యాదానం, సుమూహర్త,మాంగళ్య ధారణ,ముత్యాల అక్షతారోహన,మాల మార్పిడి వేడుక, మహా మంగళ హారతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అమ్మవారికి ఊంజల సేవ,వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్యా ణ ఉభయ దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.. అర్చకులు వెంకట హరి కుమారా చార్యులు, బృందం గోదాదేవి కల్యాణ క్రతువు పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కు చెందిన కళాకారులు కె.బాలాజీ, ఏ.నాగలక్ష్మీ ఆలపించిన అన్న మాచార్య భక్తి పాటలు భక్తులను అలరించటం తో పాటు క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ,హరికృష్ణ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందచేసారు.

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరును ప్రతి ఒక్కరూ ఖండించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

అద్దంకి , జనవరి 14, ప్రభాతవార్త :

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరును ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక అభ్యుదయ నగర్ లోని సుందరయ్య భవన్లో వెనుజులాపై అమెరికా దాడి ప్రపంచ దేశాలకు పొంచి ఉన్న ముప్పు ప్రమాదాలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా రాష్ట్ర కార్యదర్శి బి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ దాడులను ఆపాలని భారత వైఖరి స్పష్టంగా తెలపాలని ఆయన అన్నారు. వెనుజులా అధ్యక్ష లు మరియు వారి సతీమణి ని ఒక యుద్ధముంగా కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన ఘటన దారుణమన్నారు. ప్రపంచ దేశాల స్వేచ్ఛ స్వాతంత్రం సార్వభౌమాధికారాన్ని హరించేలా అమెరికా చర్యలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ చట్టాల సైతం అమెరికా రాజ్యాధినేత ట్రంప్ విస్మరించారన్నారు. వెనుజులా కు జరిగిన ఘటనపై ప్రధాన మోడీ స్పందించకపోవడం మరింత విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సిఐటియు నాయకులు మజుందార్, బి విజయ్ కుమార్, యు దేవపాలన, కావూరి రఘు చంద్, కె.వి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాలలో అరుదైన వ్యక్తి గొట్టిపాటి

- ప్రజాసేవలో పలువురికి ఆదర్శం - 6కోట్లతో విద్యార్థులు సైకిళ్ళు
- వికలాంగులు ట్రైస్కూటర్లు - చిరువ్యాపారులకు తోపుడు బండ్లు
- ఉచితంగా పంపిణీ - గొట్టిపాటి బాటలో పలువురు మంత్రులు

అద్దంకి, జనవరి 14, ప్రభాతవార్త

రాజకీయాలలో ఇటీవల కాలంలో రాష్ట్రమంత్రి గొట్టిపాటి రవికుమార్ అరుదైన వ్యక్తులలో ఒకరుగా నిలిచారు. ఈయన గత 5ఎన్నికలలో అప్రతిహత విజయాలతో ముందుకు సాగుతున్నాడు. అద్దంకి నుండి 5వ విజయం అందుకున్న తరువాత ఈ నియోజక వర్గానికి మంత్రి పదవి దక్కింది. అందుకు ఆయన రాజకీయాలలో చొరవ, చురుకుదనం, ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసి, వ్యూహాలను రూపొందించుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. ఎన్నికల వరకే రాజకీయాలు అని, అనంతరం తన నియోజక వర్గంలో ప్రతి ఓటరుకు సేవలందించడమే నాలక్ష్యమని బహిరంగంగా చాటిచెప్పే అరుదైన ప్రజాప్రతినిధులలో గొట్టిపాటి రవికుమార్ ముందున్నారు. రాజకీయాలు ఎన్నికల తరువాత ప్రక్కనపెట్టే మనస్తత్వం కలిగిన గొట్టిపాటి తనకు లభించిన మంత్రి పదవి, అధికారాన్ని సద్వినయోగం చేస్తూ ప్రజలకు ఉచిత సేవలను ఎలా అందించాలి అనే ప్రణాళికలో ముందుకు సాగుతున్నారు. అద్దంకి నుండి 5వ సారి శాసనసభ్యునిగా ఎన్నికైన తరువాత మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సంక్షేమం, అభివృద్ధి, ప్రజాసేవ కలగలిపి పాలనలో ముందుకు వెళుతున్నారు. ఆదిశగా విద్యార్థులకు ఉచిత సైకిళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికీ నియోజకవర్గంలో 6500మంది విద్యార్థినీ,విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళు అందజేశారు. రాబోయే ఏడాది కాలంలో మరో 3500 మందికి కూడ సైకిళ్ళ అందించాలనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. ఇక వికలాంగులకు సంబంధించి మూడు చక్రాల స్కూటర్లును కూడ 100మందికి ఇప్పటికే అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని చిరు వ్యాపారులకు నాలుగు చక్రాల తోపుడు బండ్లను కూడ సుమారు 500మందికి ఉచితంగా అందజేశారు. ఈ విధంగా నియోజకవర్గంలో ప్రత్యక్షంగా 7వేలమందికి పైగా ఉచితంగా సైకిళ్లను, మూడు చక్రాల స్కూటర్లు, తోపుడు బండ్లను అందించారు. ఇందుకు పలువురు దాతలు కూడ మంత్రి దాతృత్వానిబట్టి సహకారాన్ని అందించారు. ఇందుకు సుమారు 6 కోట్లదాక నిధులు మంత్రి హెచ్చించారు. గొట్టిపాటి రవికుమార్ నియోజకవర్గంలో ఈవిధంగా ప్రజా సేవలో ఉచితంగా అందిస్తున్న సేవలను రాష్ట్రంలోని పలువురు అమాత్యులు కూడ గొట్టిపాటి రవి కుమార్‌ను అనుసరి స్తున్నారంటే ఆయన సేవలు సంబధిత మంత్రులను ఎంత ఆకర్శించాయే ఇట్టే అర్ధమౌతుంది.





6_6.qxd 1/15/2026 12:05 AM Page 1



# గుంటుపల్లిలో నూతన వస్త్రాలంకరణ సందడి

**- చిన్నారులను ఆశీర్వదించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు**



**బల్లికురవ, జనవరి 14, ప్రభాతవార్త**

మండలంలోని గుంటుపల్లి గ్రామంలో బుధవారం సందడి వాతావరణం నెలకొంది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, బల్లికురవ క్లస్టర్ ఇన్‌చార్జి మల్లీనీడి గోవిందరావు మనుమడు బాలాదిత్య, వర్షశ్రీల నూతన వస్త్రాలంకరణ వేడుక సందర్భంగా నియోజకవర్గంలోని అధికార యంత్రాంగం, పలువురు ప్రజా ప్రతినిధులు గుంటుపల్లి తరలి వచ్చారు. సంతమాగులూరు సీఐ కాకుమాను వెంకటరావు, అద్దంకి రూరల్ సీఐ మల్లిఖార్జునరావు, బల్లికురవ ఎస్సై నాగరాజు, సంతమాగులూరు ఎస్సై పట్టాభి, ఎంపీడీవో కుసుమకుమారి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, దూళిపాళ్ల హనుమంతరావు, అద్దంకి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షులు కోయ పేరయ్య, నక్కబొక్కలపాడు నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, చిలకలూరిపేట, మార్టూరు, బల్లికురవ, మండలాలకు చెందిన అధికార యంత్రాంగం ఈ వేడుకకు తరలివచ్చి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరావు మాట్లాడుతూ భోగి పర్వదిన శుభవేళ భారీ జన సందోహం నడుమ చిన్నారులు వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కెబి అల్పాహారశాల ప్రారంభించిన కరణం





**బల్లికురవ, జనవరి 14, ప్రభాతవార్త**

నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందజేస్తూ వారి నమ్మకాన్ని సొంతం చేసుకున్న కేబీ రెస్టారెంట్ సౌజన్యంతో నూతనంగా ఒంగోలు ఈస్ట్ కెబిలో ఏర్పాటు చేసిన నూతన అల్పాహార శాలను బుధవారం చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి ప్రారంభించారు. వినియోగదారుల్లో తీవ్రమైన విశ్వాసాన్ని పొంది నాణ్యమైన ఉత్పత్తులను వారికి అందజేసినప్పుడు వ్యాపారం ఏదైనా స్థలం ఎక్కడైనా దాని అభివృద్ధిని ఎవరు ఆపలేరు అన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయనతో పాటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్,సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ గోరంట్ల పెద్ద వీరయ్య, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# వామపక్షాల ఆధ్వర్యంలో జీవో ప్రతులు దగ్ధం

**- నిరసన తెలిపిన నాయకులు**



**పొదిలి, జనవరి 14, ప్రభాతవార్త**

మెడికల్ కాలేజీల పబ్లిక్ ప్రైవేటు, పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని వ్యతిరేకిస్తూ కొత్తగా అమలు చేసిన విబి రామ్‌జీ( ఉపాధి) చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కొనకనమిట్లలో బుధవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మెడికవర్ కాలేజీలను ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి కే.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి పి.కొండయ్య, నాయకులు సీహెచ్ పెద్ద శిద్దయ్య, వెంకటేశ్వర్లు, పి.కాంతారావు, శ్రీనివాసులు, వెంకట నారాయణ, సీఐటీయు కార్యదర్శి ఏ.శ్రీను, బాలనర్సయ్య, వెంకటరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**పొదిలి సీపీఐ ఆధ్వర్యంలో జీవో ప్రతులు దగ్ధం :**

పొదిలి పెద్ద బస్టాండ్ సెంటర్‌లో మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ కార్యదర్శి వెంకటరత్నం ఆధ్వర్యంలో భోగి మంటల్లో జీవో కాలపీలను వేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు.

# ఘనంగా భోగి పండుగ వేడుకలు





**కొనకనమిట్ల, జనవరి 14, ప్రభాతవార్త**

మండలంలో భోగి పండుగ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచే పెద్ద ఎత్తున ఇళ్ల ముంగిట భోగి మంటలు వేసి పెద్దలు, చిన్నారులు, యువకులు చలి కాచుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, చిన్నారికట్ల,పెద్దారికట్ల, మునగపాడు, నాగరాజుకుంట , ఎదురాళ్లపాడు గ్రామాలతో పాటు పలు గ్రామాలలో భోగి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. తాటాకులు, రేగి తొడుగులు, వివిధ కపలతో భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. పోటీ పడి ఒకరికి మించి ఒకరు ప్రత్యేకంగా ముగ్గులు వేశారు. ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

# ఘనంగా భోగి పర్వదిన వేడుకలు



**బల్లికురవ, జనవరి 14, ప్రభాతవార్త**

భోగభాగ్యాల భోగి పండుగ పర్వదిన వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మనిషి ఎదుగుదలకు అవరోధంగా ఉన్న పాత అలవాట్లను వదిలి, తన ఉన్నతి కోసం కొత్త అలవాట్లను అలవర్చుకోవడం భోగి పర్వదినం నుండి కొందరు ప్రారంభిస్తుంటారు. నిజమైన మార్పు కోసం కొన్ని అలవాట్లను వదిలివేయటం అత్యంత కీలకం. ప్రతికూల ఆలోచనలు మనిషి మనుగడని ప్రశ్నార్థకంగా మారుస్తాయి. అలాంటి వాటికి ఈ పర్వదినం రోజున భోగి మంటలలో వేసేమనుకుంటూ మార్పు కోసం తమ ప్రయత్నం చేస్తారు. భోగి సమయానికి సూర్యుడు దక్షిణాయనము నుండి ఉత్తరాయణంలోకి మారుతాడు. ఈ సమయంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అందుకే భోగి పండుగ పర్వదినం రోజున భోగి మంటలు వేయటం ఆచారంగా వస్తుంది. భోగి మంటల వల్ల ఉష్టం ఉత్పత్తి అవుతుంది. చలి తీవ్రత తగ్గుతుంది. పాత వస్తువులను, ఆవు పిడకలను, భోగి మంటలకు వినియోగించడం ద్వారా వాతావరణంలోని హానికర క్రిములు నశిస్తాయి. ప్రజలకు మేలు జరుగుతుందనేది ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా గ్రామాలలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ముగ్గుల పోటీలు, కోలాటం, ప్రదర్శనలు కొనసాగాయి.

# చివరి దశకు చేరిన కబడ్డీ పోటీలు

**- నేడు ఫైనల్ పోరులో తలపడనున్న జట్లు**



**బల్లికురవ, జనవరి 14, ప్రభాతవార్త**

మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో ఫ్రెండ్స్ సర్కిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణ చివరి దశకు చేరింది. గురువారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫ్రెండ్స్ సర్కిల్ అసోసియేషన్ తెలియజేసింది. ఈ పోటీలను వీక్షించేందుకు క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొననున్నందున ఏ విధమైన అసౌకర్యాలకు తావు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ తెలియజేసింది. బుధవారం జరిగిన పోటీలలో స్కై యూత్ కోలలపూడి, కెపిడి బుల్స్ తలపడగా స్కై యూత్ కోలలపూడి విజయం సాధించింది. మరో పోటీలో పూరిమెట్ల, గోకనకొండ జట్లు తలపడగా గోకనకొండ జట్టు విజయం సాధించింది. అదే విధంగా కేపీడీ ఫ్రెండ్స్ యూత్, కొప్పెరపాడు జడ్పీహెచ్‌ఎస్ జట్లు తలపడగా జడ్పీహెచ్‌ఎస్ జట్టు విజయం సాధించింది. చివరి పోటీలో కేపీడీ కమాండర్స్ జట్టు, కొమ్మలపాడు జట్లు తలపడగా కొమ్మాలపాడు జట్టు విజయం సాధించింది. కమిటీ సభ్యులు జీవరత్నం, ముసలయ్య, దమ్ము అంజయ్య, కొండలు పోటీలను ఆద్యంతం పర్యవేక్షించగా అంకమ్మరావు, పిచ్చయ్య, రాము, గోపి, దానా రావులు రెఫరీలుగా వ్యవహరించారు.

## నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపిన మహమ్మద్ యాసిన్



**పామూరు, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు పామూరు పట్టణంలో లిమ్రా కంటి వైద్యశాల అధినేత మహమ్మద్ యాసిన్ మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ వేళల్లో ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు, సుఖసంతోషాలు నింపాలని ప్రజలు సిరిసంపదలతో భోగభాగ్యాలతో ఆయురారోగ్యాలతో కుటుంబసభ్యులంతా కలిసి పండుగ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు.

## టీడీపీ నాయకులు దాసరి రవిని పరామర్శించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలంలోని మద్దులూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మాజీ ఉప సర్పంచ్ దాసరి రవి ఇటీవల ప్రమాదంలో కాలు తీవ్రమై గాయాలకు లోనై ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతిలో ఉన్నారు. ఈ సందర్భంగా మద్దులూరు గ్రామంలో బుధవారం నాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్ దాసరి రవిని ఆయన ఇంటి వద్ద పరామర్శించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నువ్వుల మీరయ్య, వలేటి తిరుపతి స్వామి, పాటిబండ్ల రాము తదితరులు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, దాసరి రవిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## సంక్రాంతిలో భాగంగా మహిళలు, చిన్నారులచే ఆకట్టుకున్న ముగ్గులు



**సంతనూతలపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

సంక్రాంతిలో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో వారి గృహాల ముందు బుధవారం నాడు భోగిని పురష్కరించుకుని మహిళలు,చిన్నారులు విశిష్టంగా ముగ్గులు వేశారు.ఈ సందర్భంగా భోగి పండుగలో భాగంగా ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగానియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడు లోని పెద్ద బజారు నందు శిఖాకొల్లి సాయి శ్రీ నిఖిల అనే విద్యార్థి వేసిన భోగిముగ్గు పలువురిని ఆకట్టుకుంది.

# ఘనంగా భోగి సంబరాలు



**సింగరాయకొండ, జనవరి 14,ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సింగరాయకొండ మండలవ్యాప్తంగా బుధవారం భోగి పండుగ సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో, ప్రతి ఇంటి ముందు పెద్దలు, చిన్నారులు కలిసి భోగి మంటలు వేసి ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా భోగభాగ్యాలు ప్రసాదించాలని దేవుళ్లను ప్రార్థించారు. చిన్నారులకు భోగి పళ్ళతో దిష్టి తీసి సంప్రదాయాలను పాటించారు. పండుగ వాతావరణంతో మండలమంతా పల్లె పండుగ శోభను సంతరించుకుంది.

## ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆధునీకరణ పనులకు రూ.100,116 నగదు అందజేత



**చీరాల, జనవరి 14, ప్రభాతవార్త**

ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రౌండ్ నందు ఉదయం భోగి మంట వేసి, ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా వాకింగ్ సభ్యుడు చెక్క చెన్న నారాయణ ఆర్థిక సహాకారంతో ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆధునీకరణ పనులు నిమిత్తం రూ.100,116 లను ప్రెసిడెంట్, చేబ్రోలు బాలాజీరావు, సెక్రటరీ పోలిశెట్టి వేణుగోపాల్‌కి అందజేసి, సభ్యులు అందరికి అల్పాహారం ఏర్పాటు చేశారు. అందరూ వారిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, సెక్రటరీ చారగుళ్ళ గురు ప్రసాద్, నారాయణమూర్తి, డీవీ సురేష్, బదిరి నాథ్, రమేష్, వల్లెపు శ్రీనివాసరావు, నారాయణరావు, భాస్కర్, రవి, సుధాకరరావు, శ్రీరాం రమేష్, సదాశివన్నారాయణ, లాల్, మోహన్‌రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# బీబీహెచ్ బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతి ప్రధానం



**వేటపాలెం, జనవరి 14, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ సందర్భంగా బీబీహెచ్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వేటపాలెం వారి ఆధ్వర్యంలో బాపట్ల, ప్రకాశం, గుంటూరు జిల్లాలు ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో సుమారుగా 60 టీములు పాల్గొనగా మెన్స్ డబల్ ఓపెన్ కేటగిరి విధానంలో ఫస్ట్ ప్రైజ్ రమేష్ అండ్ నరసింహ మార్కాపురం వారు, రెండవ ప్రైజ్(హోమ్ టీమ్) కృష్ణారెడ్డి అండ్ మధుబాబు వేటపాలెం వారు మూడవ ప్రైజ్ రిషి అండ్ కొండలు బాపట్ల వారు నాలుగో ప్రైజ్ హోమ్ టీమ్ పృద్వి అండ్ ప్రకాష్ వేటపాలెం వారు కైవసం చేసుకోవడం జరిగింది. అదే విధంగా 45 ప్లస్ ఏజ్ కేటగిరిలో మూడు ప్రైజులు ఉండగా దానిలో ఫస్ట్ ప్రైజ్ కృష్ణారెడ్డి అండ్ ఖాదర్ మస్తాన్, సెకండ్ ప్రైజ్ సుబ్బు అండ్ శేష్‌రెడ్డి మార్టూరు వారు థర్డ్ ప్రైజ్ హరి ప్రసాద్ అండ్ రాజు హోమ్ టీం వారు కైవసం చేసుకోవడం జరిగింది. పండుగ సందర్భంగా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలియజేశారు. విజేతలకు బహుమతి ప్రధానం చేసి అభినందనలు తెలిపి కార్యక్రమాన్ని ముగించారు.

## విజేతలకు బహుమతి అందజేసిన దయిండే శివశంకర్



**పామూరు, జనవరి 14, ప్రభాతవార్త**

పామూరు మండలంలో దూబగుంట గ్రామంలో శివవంకర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రధానం అందజేసిన తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు శివశంకర్. నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలతో దూబగుంట గ్రామ పంచాయతీలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో దూబగుంట గ్రామానికి చెందిన క్రికెట్ టీమ్ ప్రధమ బహుమతిగా గెలుపొందారు. వారికి గ్రామ పార్టీ అధ్యక్షులు దయిండే శివశంకర్ చేతుల మీదుగా వారికి రూ.30వేల 116 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమానికి కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పామూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, పామూరు సీఐ మాకినేని శ్రీనివాసరావు, ఉడుముల ప్రభాకర్, మల్లిఖార్జున, ఎల్లేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురసాని రామయ్య, తెలుగుదేశం పార్టీకి శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు

**- టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు అనుమాటి సుబ్బలక్ష్మీ**



**హనుమంతునిపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

తెలుగు సంప్రదాయాలలో భాగంగా వస్తున్న సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతిని తీసుకురాగలదని టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు అనుమాటి సుబ్బలక్ష్మీ అన్నారు పాడి పంటలకు ఎటువంటి లోటు లేకుండా సస్యశ్యామలంగా రైతులందరూ సుభిక్షంగా ఉంటూ మరెన్నో ఇలాంటి ఆనందోత్సవాలను జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మండల ప్రజలకు ఆమె సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి సుఖ సంతోషాలను కనుమ కమణీయమైన అనుభూతులను అందించాలని అవి మీ జీవితాల్లో వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పండుగను మీ కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన

**- టీడీపీ మండల నాయకులు కూరాకు వెంకట్**



**హనుమంతునిపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

హనుమంతునిపాడు మండలం నాయకులు కూరాకు వెంకట్ కనిగిరి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సాంప్రదాయమైన పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆనందంగా జరుపుకోవాలని తెలియజేశారు. ప్రతి తెలుగువారింట పాడి పంటలు, సిరి సంపదలతో నిండి ఉండాలని దేవుని కోరుకున్నట్లు తెలిపారు.

## ఆంధ్రకేసరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగి మంటలు

**- గ్రామాలలో సంక్రాంతి సంబరాలు**

**మార్టూరు,జనవరి 14, ప్రభాతవార్త**

తెలుగు సంప్రదాయాలకు నిదర్శనమైన సంక్రాంతి సంబరాలను గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. సంక్రాం సంబరాలు తొలి రోజు భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. భోగి మంటలలో తమ కష్టనష్టాలు తొలగి పోయి సుఖ సంతోషాలు కలగాలని ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేయడం ఆనవాయితీ. దీని ప్రకారం గ్రామాల్లో నలువీధులను గృహాల ముందు పెద్ద ఎత్తున భోగి మంటలు ఏర్పాటు చేశారు. రాజుపాలెం గ్రామంలోని ఆంధ్రకేసరి యూత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. అనంతరం స్వీట్‌లు పంపిణీ చేశారు. గ్రామంలోని కోదండ రామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆంధ్రకేసరి యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు, యువకులకు షటిల్ వాలీబాల్ పోటీలు ప్రారంభించారు.

# ఘనంగా గోదాదేవి కళ్యాణ మహోత్సవ వేడుకలు







**సంతనూతలపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం నాడు గోదాదేవి, రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ, వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఈ గోదాదేవి కళ్యాణ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. అంతక మునుపు రంగనాథ స్వామి, గోదాదేవిలకు పసుపు కొట్టి, వడియాలు పెట్టి పెళ్ళి కొడుకు పెళ్ళి కూతుర్లను తయారు చేశారు. తదుపరి ముసుగుల హారతి, ఎదురుకోల ఉత్సవం నిర్వహించారు. గోదాదేవి రంగనాథ్ స్వాముల కళ్యాణం అనంతరం సంతనూతలపాడు పురవీధుల్లో బుధవారం సాయంత్రం స్వామివాళ్లకు గ్రామోత్సవం నిర్వహించారు. వేద పండితులు గూడా సాయిరాం, నేలబట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాథ స్వాములకు కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ శిద్దా సూర్య ప్రకాష్‌రావు స్వామి వాళ్లకు పట్టు వస్త్రాలను బహుకరించారు. అనంతరం అన్నదాన వేడుకలను నిర్వహించారు. వందలాది మంది భక్తులు, మహిళలు ఈ గోదాదేవి కళ్యాణ మహోత్సవం వేడుకల్లో విరివిగా పాల్గొన్నారు. ఈ కళ్యాణ మహోత్సవం సంతనూతలపాడులో ఒక పండుగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్స్ వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, గ్రంధి లక్ష్మీ ప్రసాదరావు, వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, తదితరులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ శిద్దా సూర్య ప్రకాష్‌రావు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ చలువాది సుబ్రహ్మణ్యం, క్యాబినెట్ ట్రెజరర్ గుర్రం రంగనాథ్, ఐసీసీ టంగుటూరి రంగస్వామి, రీజియన్ సెక్రటరీ వి.అనిల్,జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి చక్కా సుబ్బరాయుడు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు వేమా మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్.సత్యనారాయణ, సెక్రటరీ పి.ఆంజనేయులు, కోశాధికారి వేమా చిన్న వెంకట కృష్ణారావు, వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, సెక్రటరీ ఎస్.రాజేష్, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ గౌరవ అధ్యక్షురాలు జి.సులోచన, అధ్యక్షులు వేమూరి నాగమణి, సెక్రటరీ ఎస్.జయశ్రీ, కోశాధికారి ఎన్.శ్రీలక్ష్మీ, మద్దిపాడు డిప్యూటీ ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, మాజీ సొసైటీ అధ్యక్షులు దుంపా యల్లమందరెడ్డి, శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా భోగి వేడుకలు



**సంతనూతలపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆవరణలో బుధవారం ఉదయం వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా భోగి వేడుకలు నిర్వహించారు. గ్రామీణ వాతావరణంలో ఆనంద ఉత్సావాల మధ్య ఈ భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు.మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్‌లు వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, జీఎల్ ప్రసాదరావు, వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, క్లబ్ అధ్యక్షులు వేమూరి ఆంజనేయులు, సెక్రటరీ శిఖాకొల్లి రాజేష్, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ గౌరవ అధ్యక్షురాలు జి.సులోచన, అధ్యక్షులు వేమూరి నాగమణి, సెక్రటరీ శిఖకొల్లి జయశ్రీ, కోశాధికారి ఎన్.శ్రీ లక్ష్మీ, తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# సంక్రాతి తెలుగు వారి గొప్ప పండుగ

**- ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి**

**- మహిళల ఉత్సాహంతో మార్కాపురంలో సంక్రాంతి సంబరాల సందడి**





**మార్కాపురం, జనవరి 14, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలో సంక్రాంతి పండుగను ప్రజలతో కలిసి ఘనంగా జరుపుకుంటూ, శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నాయుడు బజార్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు పండుగ వాతావరణాన్నిసంతరించుకున్నాయి. ఈ కార్యక్రమం పట్టణ ప్రజలు, ముఖ్యంగా మహిళలతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన కోలాటం నృత్య రూపకం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. సంప్రదాయ సంస్కృతి, కళలకు ప్రాధాన్యం ఇస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అనంతరం మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, లెమన్-స్పూన్ వంటి ఆటలు ఉత్సాహంగా సాగాయి. మహిళలు ఆనందోత్సాహాలతో పాల్గొని పండుగ సందడిని రెట్టింపు చేశారు.పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సంక్రాంతి తెలుగువారి గొప్ప పండుగ. మహిళలు కుటుంబ బాధ్యతలతో నిరంతరం కష్టపడుతుంటారు. వారికి కొంత ఆనందం, రిలీఫ్ అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం” అని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వందలాది మహిళలు, పట్టణ ప్రజలు తరలివచ్చి సంబరాల్లో పాల్గొనడంతో నాయుడు బజార్ ప్రాంతం పండుగ కళతో ఉట్టిపడింది.

## మందా చిన్నా కుటుంబానికి వైస్ ఎంపీపీ ఆర్థిక సాయం



**తాళ్లూరు, జనవరి 14, ప్రభాతవార్త**

తాళ్లూరు గ్రామానికి చెందిన మందా చిన్నా రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు.మృతుని కుటుంబానికి బుధవారం దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి, డాక్టర్ లలితసాగర్‌ల ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి చేయూతనిచ్చారు.మందా చిన్నా కుటుంబాన్ని పరామర్శించి ఆయన అంతిమ సంస్కారాల నిమిత్తం రూ. 5వేల నగదును అందించారు. కార్యక్రమంలో నాయకులు అనపర్తి సుబ్బారావు, ఇమ్మానియేలు ,ఆదాం,సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా పొట్టేళ్లు ప్రదర్శన



**సంతనూతలపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

సంక్రాంతి వేడుకల్లో భాగంగా సంతనూతలపాడులో యాదవ సంఘం ఆధ్వర్యంలో పొట్టేళ్ల ప్రదర్శన నిర్వహించారు.ఈ ప్రదర్శనలో ముందంజలో రాణించిన పొట్టేళ్లకు సంబంధించి వాటి యజమానులకు దాతలు ప్రైజ్ మనీని పంపిణీ చేశారు. సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామానికి చెందిన యద్దనపూడి శ్రీనివాసరావు పెంపకం చేపడుతున్న పొట్టేలు ప్రధమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా సంతనూతలపాడుకు చెందిన నల్లగట్ల ఆంజనేయులు ప్రధమ స్థానం సాధించినందుకుగాను యద్దనపూడి శ్రీనివాసరావుకు 30 వేల రూపాయల బహుమతిని అందజేశారు. ద్వితీయ బహుమతి సంతనూతలపాడుకు చెందిన యద్దనపూడి అశోక్ పొట్టేలు సాధించింది. వీరికి దాత మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్ బాబు రూ.20వేల రూపాయలు బహుమతిని అందజేశారు. తృతీయ బహుమతిని చంద్రపాడు గ్రామానికి చెందిన చిట్టిబోయన గోపాల్ పొట్టేలు సాధించింది. వీరికి దాత సంతనూతలపాడుకు చెందిన యద్దనపడూఇ అశోక్ రూ.10వేలు అందజేశారు. చతుర్ధ బహుమతిని సంతనూతలపాడుకు చెందిన బాపట్ల వెంకటేష్ పొట్టేలు సాధించింది. వీరికి సంతనూతలపాడు టీడీపీ నేత నల్లగట్ల వెంకట సుబ్బారావు రూ.5వేలు బహుమతిని అందజేశారు. ముందంజలో నిలిచిన పొట్టేలుకు సంబంధించి వాటి యజమానులకు దాతలు అందించిన ప్రోత్సాహక బహుమతులను సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు సాదినేని శ్రీరామమూర్తి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్ బాబు, టీడీపీ నేతలు నలగట్ల సుబ్బారావు, నల్లగట్ల శ్రీనివాసరావు ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఎన్.ఆంజనేయులు,పి.స్థానకాలు,బాపట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.సంక్రాంతిని పురష్కరించు కుని మండలంలో పొట్టేళ్లను సాగు నిమిత్తం పెంచుకుంటున్న ముఖ్యంగా యాదవ సంఘం నాయకుల తమకు చెందిన పొట్టేల్లను ఈ ప్రదర్శన కార్యక్రమంలో ప్రదర్శింపచేశారు.

# అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు




**కురిచేడు, జనవరి 14, ప్రభాతవార్త**

మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగ తొలిరోజు అయిన భోగి పర్వదినాన్ని ప్రజలు అంరంగవైభవంగా జరుపుకున్నారు. ఉదయమే భోగి మంటలు వేసి ఉల్లాసంగా గడిపారు. మండల కేంద్రమైన కురిచేడులో మండల ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ,ఆమె భర్త లలిత్ సాగర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురిచేడులో ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన సంబరాలు తమకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని తెలిపారు. ఆర్యవైశ్యులు గత ఎన్నికల్లో కూడా తమకు మద్దతుగా నిలిచారని తదనుగుణంగా వారికి ఏ అవసరం అయిన నేను వారి వెనుక అండగా ఉంటానని పేర్కొన్నారు. తొలుత ఆర్యవైశ్య మహిళలచే నిర్వహించబడిన కోలాటంలో ఆమె సైతం ఉత్సాహంగా పాల్గొని కోలాటాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పిడతల నెమిలయ్య, జిల్లా టీడీపీ వైస్‌ప్రెసిడెంట్ కాట్రాజు నాగరాజు, పార్టీ నాయకులు షేక్ సునీల్, మేడం నాగేశ్వరరావు, గడ్డం బాలయ్య, ఆర్యవైశ్య సంఘ ప్రెసిడెంట్ జవాజి సత్యనారాయణ, మోదాల ఆంజనేయులు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో జ్యోతి ప్రజ్వలన



**కురిచేడు, జనవరి 14, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన కురిచేడులో బుధవారం నాడు అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద 30కేజీల కర్పూరంతో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించారు. అయ్యప్ప దీక్షదారులు, ఇతర భక్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. అంతకముందు స్వామివారికి అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం పద్దెనిమిది మెట్లకు పడిపూజ నిర్వహించారు.

# మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

### - టీడీపీ మండల అధ్యక్షులు గురునాథం



**లింగసముద్రం, జనవరి 14, ప్రభాతవార్త**

లింగసముద్రం మండల ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం మండలంలోని ప్రజలు తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి వేడుకను అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. ప్రతి ఇంట భోగభాగ్యాలు కలగాలని పాడి పంటలు, అభివృద్ధి చెందాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగను అందరూ కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాలతో సంతోషంగా జరుపుకోవాలని ఈ సంధ్బంగా మండల టీడీపీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం ఆకాంక్షించారు.

## కోడిపందాల రాయుళ్లు అరెస్టు



**వలేటివారిపాలెం, జనవరి 14, ప్రభాతవార్త**

వలేటివారిపాలెం మండల పరిధిలోని కట్లంపాలెం పొలాలలో కోడిపందాలు వేస్తున్నారని ఎస్సై మరిడి నాయుడికి సమాచారం రాగానే తన సిబ్బందితో కలిసి కోడిపందాల స్థావరంపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈదాడిలో కోడిపందాలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.15150 డబ్బులను మూడు కోడిపుంజులు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు.

## భోగి పండుగకు ఘనస్వాగతం



**కందుకూరు జనవరి 14 ప్రభాతవార్త**

కందుకూరు నియోజకవర్గంలో ప్రజలు సంక్రాంతి పండుగను బుదవారం బోగిపండుగతో ఘనంగా స్వాగతించారు. వేకువఝామునే జనం నిద్రలేచి భోగి మంటలు వేశారు. పట్టణంలో సాయినగర్, విజయనగర్ కాలనీ, బలిజపాలెం సింహాద్రినగర్, వెంకటేశ్వరనగర్, గుర్రం వారిపాలెం, తూర్పువడ్డి పాలెం, రజకపాలెం, యాదవపాలెం తదితర ప్రాంతాలలో సాంప్రదాయ బద్దంగా బోగిపండగను స్వాగతించారు. బోగిమంటల అనంతరం తలంటిస్నానాలు చేశారు. కొత్తబట్టలు ధరించి ఇష్టదైవాలకు పూజలు చేశారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తన సతీమణి సౌజన్యతో కలిసి బడేవారిపాలెంలో బోగిమంటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఉలవపాడు మండలం చాకిచర్లలో కోలాటాన్ని అద్భుతంగాప్రదర్శించారు. వలేటివారిపాలెం, పోకూరు, శాఖవరం, కొండముదుసుపాలెం, కోవూరు, పందలపాడు తదితర ప్రాంతాలలో రైతులు బోగిపండుగను ఘనంగా నిర్వహించారు.

## ఎమ్మెల్యేకి సంక్రాంతి శుభాకాంక్షలు



**కందుకూరు జనవరి 14 ప్రభాతవార్త**

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె తమ సభ్యులతో పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలసి పుష్పగుచ్చంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు వేముల కృష్ణ, ఉన్నం చిరంజీవి, పల్లపోతు వెంగళరావు, నేతి మనోహర్, తోకల సుబ్బారావు, తోకల గోపి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని మాచవరం రోడ్డులో కొత్తగా ఏర్పాటుచేసిన మిస్టర్ చాయ్ దుకాణాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవాదృక్పథంలో వ్యాపారనిర్వహణ సాగాలనినిర్వాహకులు పెయ్యల రవి,పీటర్ బాబులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు అప్పనబోయిన నరసింహారావు, ముచ్చు శ్రీనివాసరావు, గుమ్మ శివ, చుంచు వేణు, భవనాసి వెంకటేశ్వర్లు, నాదెండ్ల మధు, అత్తంటి శివకృష్ణ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు

# వివేకానంద పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కందుకూరు జనవరి 14 ప్రభాతవార్త**

కందుకూరు పట్టణంలో వివేకానంద స్కూలు 1999-2000నాటి 10వ తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయసమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. గతంలో ఈ పాఠశాల పామూరు రోడ్డలో కరస్పాండెంటు జి.వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. 25ఏళ్ల కావడంతో సిల్వర్ జూబ్లీ వేడుకలను స్థానిక వెంగమాంబ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ వేడుకలకు ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో, పలు రంగాల్లో స్థిరపడిన నాటి స్నేహితులంతా హాజరై సందడి చేశారు. స్కూల్ డేస్ లో తామచేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తుచేసుకొని మురిసిపోయారు. అలాగే ఒకరికి ఒకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి గురువులందరినీ ఆహ్వానించి ఘనంగా సన్మానించి వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. గత స్మృతులను నెమరువేసుకొంటూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని పలువురు వ్యాఖ్యానించారు. మానవ సంబంధాలను బలోపేతం చేస్తాయన్నారు. సామాజిక సేవవైపు పయనించాలని పలువురుసూచించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి స్కూల్ కరస్పాండెంట్ జి.వీరబాబు, భీమవరం జడ్పీస్కూల్ హెచ్ఎం బండిసుబ్బారావు, ఉపాధ్యాయులుపెంట్రాలసుబ్బారావు, ఈశ్వర్‌రెడ్డి, మాధవరావు, వరదారావు, బండివెంకటేశ్వర్లు, మాల కొండయ్య, సురేష్, ఈశ్వర్‌రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, భాస్కరరావు, రాజ్‌కుమార్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.



# ఎస్ఎం హాస్టల్ పూర్వవిద్యార్థులకు సన్మానం



**కందుకూరు జనవరి 14 ప్రభాతవార్త**

కందుకూరు టీఆర్ ఆర్ గవర్నమెంటు స్టూడెంట్స్ మేనేజమెంట్ హాస్టల్ విద్యార్థులు వివిద రంగాలలో రాణిస్తున్నట్లు హైదరాబాద్ గాంది హాస్పటల్ డాక్టర్ ఎస్ రవీంద్ర అన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఏ రంగంలో ఉన్న సామాజిక సేవాదృక్పధంతో పని చేస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. విద్యార్థిదశలో నెలకొన్న ప్రేమానుబంధాలు బలంగా ఉంటా యన్నారు. నాలుగు దశాబ్దాలనాటి అనుబంధం ఈనాటికి చెక్కుచెదరకపోవడం ఇందుకు నిదర్శమని ఆయన వాఖ్యానించారు. బుధవారం కందుకూరు బాలికల పాఠశాలలో కందుకూరు ఎస్ ఎం హాస్టల్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పూర్వ హాస్టల్‌విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. హాస్టలలో చదివి వివిద ప్రభుత్వశాఖలలో ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురు పూర్వవిద్యార్థులను ఘనంగా సన్మానించారు. వైద్యశాఖలో పనిచేసిన డాక్టర్ ఓనారియల్, పంచాయతీరాజ్‌లో ఎంపీడీవోగా పనిచేసిన బొట్లగట్టు శ్రీనివాసులు, విద్యాశాఖలో పనిచేసిన స్కూల్ అసిస్టెంట్ ఇమ్మానియేల్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు. హాస్టల్ పూర్వ విద్యార్థుల సంఘ నాయకుడు మరియు రిటైర్డ్ ఎంపీడీవో గౌడపేరు కోటిలింగం మాట్లాడుతూ ఈ సాంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. సంక్రాంతి సమయంలో రిటైర్ అయిన మన పూర్వ విద్యార్థులందరికీ సన్మానం చేస్తామని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాబు జగ్జీవన్ రామ్, జనార్ధనరావు, కల్లగుంట మోహనరావు, పల్నాటి శ్రీరాములు, దేవరపల్లి బిక్షాలు, అబ్దుల్లా, పెద్ద బ్రహ్మయ్య, కోలా ప్రసాదు దమ్ము సుందరం, మున్నంగి రమేష, దంతం రాజా తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రి భోగి పండగ శుభాకాంక్షలు



**కందుకూరు జనవరి 14 ప్రభాతవార్త**

కందుకూరు నియోజకవర్గప్రజలకు మాజీ మంత్రి మానుగంట మహీధర్‌రెడ్డి బుధవారంబోగిపండగను స్వాగతిస్తూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సంక్రాంతి సందర్భంగా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, బోగబాగ్యాలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు. తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతీకని, సంక్రాంతికి ప్రతీ ఇల్లు ధాన్యపురాశులతో కళకళలాడాలని, ఉషోదయాన్నే హరిదాసుల కీర్తనలు భం భం జంగమదేవరలు హాస్యాన్ని పండించే వేషధారణతో పగటివేషగాళ్ళు, డూ డూ బసవన్న అంటు గంగిరెద్దులవాళ్ళు మా ఇంటికి రండి అని ఆహ్వానించే గొబ్బెమ్మలు, గాలి పటాల రెపరెపలతో పల్లెలన్నీ కళకళలాడాలని కోరారు. నేటి సంక్రాంతి అందరి జీవితాలలో నూతనకాంతి నింపాలని ఆయన ఆకాంక్షించారు.

## ఉత్సాహంగా ప్రారంభమైన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

### - పోటీలను ప్రారంభించిన జడ్పీటీసీ అక్కిదాసరి



**పొదిలి, జనవరి 14, ప్రభాతవార్త**

కొనకనమిట్ల మండలం గొట్లగట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జడ్పీటీసీ సభ్యులు అక్కిదాసరి ఏడుకొండలు, నాయకులతో కలిసి టాస్ వేసి ప్రారంభించారు. 20 జట్లు ఈ పోటీలలో పాల్గొంటాయి. తొలుత రెడ్డెంవారిపల్లె, సలనూతల జట్లు తలపడ్డాయి. సంక్రాంతి పర్వదినం కావడంతో పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యువకులు, పెద్దలు తలరివచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో బహుమతి దాతలు పొదిలి రంజిత్ కుమార్, కాసు వెంకటేశ్వరరెడ్డి(ఎన్ఆర్ఐ), పల్లపాటి కాంతారావు, మద్దూరి బాలాజీ, మండల వైకాపా ఉపాధ్యక్షులు పోలసాని నారాయణరెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ మెంబర్ పసల చెన్నకేశవులు, నాయకులు దొంతిరెడ్డి రామిరెడ్డి, వంకాలయపాటి మాలకొండయ్య, నాగం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా

### - పారిశుధ్యం, వీధి లైట్లపై ప్రత్యేక శ్రద్ద

### - నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమీషనర్ మారుతిరావు



**పొదిలి, జనవరి 14, ప్రభాతవార్త**

పొదిలి నగర పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన నగర పంచాయతీ కమీషనర్ ఏ.మారతిరావు అన్నారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా పట్టణ సమస్యలపై, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచన మేరకు పొదిలి అభివృద్ధికి అన్ని విధాల ప్రయత్నం చేస్తామని, మున్సిపల్ కాలువలపై అక్రమంగా ఉన్న నిర్మాణాలు, ఆక్రమణ దారులకు త్వరలో నోటీసలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న 24 గంటలలో ఇస్తామన్నారు. గృహ యజమానులు ఇంటి పన్నులు సకాలంలో కట్టి పొదిలి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. బీపీఎస్ స్కిమ్ కింద అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలని, మంచినీటి కనెక్షన్ కొరకు ప్రభుత్వం సూచించిన విధంగా నగదు చెల్లించి కనెక్షన్ పొందాలని కోరారు. త్వరలో అక్రమ కనెక్షన్ల అన్నింటిని తొలగిస్తామని పొదిలిని అభివృద్ధి చేయాలంటే ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## ఆటల పోటీల విజేతలకు గొట్టిపాటి లక్ష్మీ బహుమతులు అందజేత




**దర్శి, జనవరి 14, ప్రభాతవార్త**

సంక్రాంతి సంబరాలలో భాగంగా దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన ఎం.ప్రత్యూష, డి.నాగలక్ష్మీ, పావని జానకి, వేముల భవాని, వి.రాజేశ్వరిలకు అందజేశారు. జూనియర్స్ లక్కీ ఛాన్స్‌లో లక్కాకుల అశ్వంత్, కూరంగి నికిత శ్రీ, మల్లెబోయిన మోక్షజ్ఞ కుమార్‌లకు అందజేశారు. పురుషుల సీనియర్స్ లక్కీ ఛాన్స్‌లో గంగిశెట్టి రామస్వామి, ముబ్బరాజు వేణు, మణికొండ ఆదినారాయణలకు అందజేశారు. మహిళల సీనియర్స్ లక్కీ ఛాన్స్‌లో పాలంకి అనురాధ, పేరం కవిత, కే.నాగమణిలకు అందజేశారు. ఆడపిల్లల లెమన్ అండ్ స్పూన్‌లో రేల్ల అక్షయ, రేల్ల అక్షర, తాండవ ఆరాధ్యలకు అందజేశారు. అబ్బాయిల లెమన్ అండ్ స్పూన్‌లో బి.నాగచైతన్య, పి.లిఖిత్, జి.యశ్వంత్‌లకు అందజేశారు. ట్రిక్స్ బ్యాలెన్స్‌లో భువనగిరి కుమారి, జిల్లెలమూడి చంద్రకళ, అంబటి జ్యోతిలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

# వైసీపీ నుంచి 51 కుటుంబాలు టీడీపీలో చేరిక




**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి మండలం బొమ్మిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రాగిమానిపల్లి, గుండ్లపాలెం గ్రామాలకు చెందిన వైసీపీకి చెందిన 51 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో బుధవారం చేరాయి. ఈ సందర్భంగా వైసీపీ ప్రధాన నాయకులు ఏనిమినిరెడ్డి వెంకటేశ్వర్లు, బాలకోటయ్య తమ అనుచరులు, కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ఉగ్ర పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోవడం, ప్రజల సమస్యలపై అధికార పార్టీ పూర్తిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం వల్ల వైసీపీపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకానికి నిలబడి పని చేస్తున్న పార్టీ తెలుగుదేశమేనని, కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి తమ ప్రభుత్వ ప్రాధాన్యమై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, టీడీపీ మండల అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బజార్ ఓబుల్ రెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, టీడీపీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా గోదాదేవి కళ్యాణం




**సింగరాయకొండ,జనవరి 14, ప్రభాతవార్త**

దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని పాత సింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి మూలవిరాట్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి, గోదాదేవి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కళ్యాణ క్రతువును నిర్వహించారు. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఉదయం స్వామివారి ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు అలాగే స్పూన్ గేమ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3000, ద్వితీయ బహుమతిగా రూ.2000, తృతీయ బహుమతిగా రూ.1000 నగదు బహుమతులను ఆలయ ఈవో కృష్ణవేణి చేతుల మీదుగా అందజేశారు. సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా గురువారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, ఉదయగిరి సుదర్శన చార్యులు, విక్కిరాల లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## వనమా రుచితశ్రీ ప్రతిభకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఘన సత్కారం



**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

ఒంగోలులో నిర్వహించిన ఈఈ మెరిట్ టెస్ట్‌లో జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన వనమా రుచితశ్రీకి ఘన సన్మానం లభించింది. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఈ సత్కార కార్యక్రమం జరిగింది. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసవి క్లబ్ అధ్యక్షులు రాచపూటి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు చక్కా బసవేశ్వరరావు నేతృత్వంలో రుచితశ్రీకి జ్ఞాపికను బహుకరించి అభినందనలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాచపూటి వెంకటేశ్వర్లు చక్కా బసవేశ్వరరావు జిల్లా స్థాయిలో సాధించిన ఈ విజయం రుచితశ్రీ ప్రతిభకు నిదర్శనం. రానున్న అన్ని పోటీ పరీక్షల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కూడా రాణించాలని ఆకాంక్షిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ, స్థానిక కమిటీ నాయకులు కనుమర్లపూడి లక్ష్మీమోహన్, కొలిపాకుల రమేష్, పైడిమర్రి సుబ్బయ్య, కొలిపాకుల దుర్గా శ్రీనివాసులు, అచ్యుత కృష్ణ, తాళ్లూరి అరుణ మహేష్, గర్రె శిరీష, తదితరులు పాల్గొని రుచితశ్రీని ఘనంగా సన్మానించారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ బుధవారం సందేశం విడుదల చేశారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని, పాడి పంటలు అభివృద్ధి చెందాలని, రైతులు మరింత సుభిక్షంగా మారాలని ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో పండుగ జరుపుకొని ఆనందించాలన్నారు.

## కనిగిరి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన చింతలచెరువు



**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరినియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, మాజీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి బుధవారం తెలిపారు. పాడి పంటలు పుష్కలంగా పండుతూ నియోజకవర్గం సుభిక్షంగా మారాలని, ప్రతి ఇంటా పండుగ ఆనందం నిండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ముందుకు సాగాలని కోరుతూ సంక్రాంతి పండుగ శాంతి, సంపద, ఏకతా చేకూర్చాలని అభిలాషించారు.

# కనిగిరి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన పల్నాటి భాస్కర్‌రెడ్డి, ఆళ్ల శివనారాయణ

**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ కనిగిరి నియోజకవర్గ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు పల్నాటి భాస్కర్‌రెడ్డి, వీరరామాపురం సర్పంచ్ ఆళ్ల శివనారాయణ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తెలుగువారి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని, రైతులకు వరి, పాడి పంటలు పుష్కలంగా పండాలని, ఆయురారోగ్యాలతో ప్రజల జీవితం సంతోషంగా సాగాలని పల్నాటి భాస్కర్‌రెడ్డి, శివ నారాయణ ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని, ప్రతి ఒక్కరికి అభివృద్ధి అవకాశాలు సిద్ధించాలని ఈ సందర్భంగా వారు అన్నారు.

## కనిగిరిలో అంగరంగ వైభవంగా గోదాదేవి రంగనాధుల కళ్యాణ మహోత్సవం




**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలో గోదాదేవి - రంగనాథుల కళ్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయం వీధిలో గల శ్రీ సీతారాముల వారి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన ఈపుణ్య కార్యక్రమం భక్తుల రద్దీతో కళకళ లాడింది. కళ్యాణ మహోత్సవం శ్రీ రామభక్త సమాజం అధ్యక్షులు చెన్నా వెంకట సుబ్రహ్మణ్యం దంపతులు, గోనుగుంట్ల రామ అనిల్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తిపార్వం నడుమ జరిగిన కళ్యాణం అనంతరం విచ్చేసిన భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ వాగిచెర్ల వెంకటేశ్వర్లు, కోశాధికారి ఉప్పాల నరసింహారావు, ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ కొలిపర్తి వెంకటస్వామి, బచ్చు వెంగయ్య, అయిత శ్రీరాములు, టంగుటూరి గోవిందరావు, రాచపూడి వెంకటేశ్వర్లు, చెక్కా బసవేశ్వరరావు, మునగా ప్రసాద్, కొలిపాకుల సురేష్, అచ్యుతకృష్ణ, చప్పరపు వీరబ్రహ్మం, పైడిమర్రి కృష్ణారావు, ఏవీ అనిల్ కుమార్, అద్దంకి సుబ్రహ్మణ్యం, అద్దంకి వెంకటేశ్వర్లు, ఇతర కార్యవర్గ సభ్యులు, రామాలయం యూత్ ఫోర్స్ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## కనిగిరి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఫిరోజ్, రవి



**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా కనిగిరి ప్రజలందరికి హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలను కనిగిరి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, పార్టీ సీనియర్ నాయకులు తమ్మినేని సురేంద్రరెడ్డి, 7వ వార్డు అధ్యక్షుడు పిల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి ఉండేలా శ్రీనివాసరెడ్డి, తెలిపారు. సంక్రాంతి పండుగ తెలుగువారి సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ అని పేర్కొంటూ, ప్రతి కుటుంబం ఆనందం, శాంతి, సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి మార్గంలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజా అవసరాలు, మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటా ఆయురారోగ్యం, పాడి పంటలు భాగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కనిగిరి ప్రజలందరికి మరోసారి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## కనిగిరి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాది చప్పరపు వాసు



**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ న్యాయవాది చప్పరపు వాసు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగువారి జీవన పద్ధతికి ప్రతిబింబంగా నిలిచే సంక్రాంతి పండుగ ప్రతి ఇంటిలో శాంతి, సౌభాగ్యాలు, ఆనందాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. రైతుల పాడి పంటలు పుష్కలంగా పండుతూ గ్రామాలు సుభిక్షంగా ఉండాలని కోరారు. పండుగ ఆనందాన్ని కుటుంబ సభ్యులతో కలిసి పంచుకుంటూ ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత విస్తరించాలని వాసు అన్నారు. ప్రాంత అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రతి ఒక్కరూ సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

8_8.qxd 1/15/2026 12:08 AM Page 1



## ఇందిరా కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పనులు వెంటనే పూర్తి చేయాలి

### - చైర్మన్ అబ్దుల్ గఫార్



**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి ఇందిరా కాలనీలో నిలిచిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్ భవన పనులను తక్షణమే పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం సమస్య పరిష్కార కార్యక్రమంలో భాగంగా భవనాన్ని తనిఖీ చేసిన అనంతరం అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పనులు సంవత్సరాలుగా స్తబ్దుగా ఉండటం హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కనిగిరి మున్సిపాలిటీలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి ఒక్కొటికి రూ.80లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసినప్పటికి ఇందిరా కాలనీలో పని పూర్తి కాకపోవడం విచారకరమని ఆయన అన్నారు. అదే సమయంలో దేవంగనగర్ సెంటర్ అదనపు నిధులతో పూర్తి కావడం జరిగిందని గుర్తు చేశారు. పనులు నిలిచిపోవడానికి కారణం వివరించాలని అధికారుల్ని కోరిన చైర్మన్, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే అయితే వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేద ప్రజలకు అత్యంత అవసరమైన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం కాకపోవడంతో డాక్టర్లు, సిబ్బంది, రోగులు అద్దె భవనాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పనులను వేగవంతం చేసి హెల్త్ సెంటర్‌ను వినియోగానికి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలన్నారు.

## సంక్రాంతి సందడిలో బజాజ్ బంపర్ ఆఫర్లు



**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ సందడిలో భాగంగా కనిగిరి పట్టణంలోని బజాజ్ షోరూం వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు బజాజ్ ఓబుల్‌రెడ్డి బుధవారం మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతులు మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగను పురస్కరించుకుని పల్సర్ శ్రేణి ద్విచక్ర వాహనాలపై ఆకర్షణీయ రాయితీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పల్సర్ 125 సీసీ నియాన్ పై రూ.10,000 వరకు డిస్కౌంట్, పల్స్ 150 సీసీ మోడల్‌పై రూ.3000 రాయితీతో పాటు మరెన్నో బహుమతులను ప్రకటించినట్లు తెలిపారు. ఈ సంక్రాంతి ఆఫర్లు మరిన్ని పది రోజులు కొనసాగనున్నాయని, కొత్త ద్విచక్ర వాహనాలను కొనాలనుకునే వారు ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ఓబుల్‌రెడ్డి సూచించారు.

## అమరావతి గ్రౌండ్స్‌లో భోగి సంబరాలు.. దద్దరిల్లిన కనిగిరి



**కనిగిరి, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం ఉదయం పండుగ వాతావరణందో రద్దీ రద్దీగా మారింది. భోగి పండుగను పురస్కరించుకుని ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో భోగి సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన భోగి మంటల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కుటుంబ సభ్యులతో పాటు కూటమి శ్రేణులు పాల్గొని సంప్రదాయ పద్దతిలో భోగి మంటలు వెలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ భోగి పండుగతో ప్రారంభమైన సంక్రాంతి శుభ వేడుకలు ప్రతి ఇంటికి సంతోషాన్ని, శాంతిని అందించాలని కోరుకుంటున్నాను. రైతులు సుభిక్షంగా ఉండాలి, పంటలు బంగారంలా పండాలి అని ఆకాంక్షించారు. స్థానిక ప్రజల పాల్గొనుక, నాయకుల సమూహం, సాంప్రదాయ సంబరాలతో కనిగిరి పట్టణంలో భోగి వేడుకలు విశేషంగా నిలిచాయి. కార్యక్రమంలో కనిగిరి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, కనిగిరి మున్సిపాలిటీ తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, పట్టణ కార్యకర్తలు పాతూరు నాగ, గుడిపాటి ఖాదర్, షేక్ ఖాజా రెహమాన్, వెన్న శ్రీనివాసరెడ్డి,ఐవి.నారాయణ,గాయం తిరుపతిరెడ్డి,సానికొమ్ము తిరుపతిరెడ్డి,కొల్లూరి శ్రీనివాసులు, బి.రామ సుబ్బారెడ్డి, నజముద్దిన్, కోట సురేష్, పిల్లి కిరణ్ కుమార్‌రెడ్డి, మోహన మురళి, పైడిమర్రి సత్యనారాయణ, రంగ, కాంట్రాక్టర్ ప్రసాద్‌రెడ్డి, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పామూరు మండల ప్రజలకు సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేసిన కంచర్ల నరసయ్య



**పామూరు, జనవరి 14, ప్రభాతవార్త**

పామూరు మండల ప్రజలకు మండల రజక మాజీ కార్యదర్శి, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి కట్టకిందపల్లి గ్రామ పంచాయతీ 4వ వార్డు నెంబర్ కంచర్ల నరసయ్య సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కంచర్ల నరసయ్య మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగ రోజున పాత బాధలు కష్టాలు తొలగిపోయి మన అందరి జీవితంలో కొత్త వెలుగులు వెలగాలని, రైతులు శ్రమకు, గౌరవం, ప్రకృతి, కృతజ్ఞత, పశుసంపద, అభివృద్ధి, ప్రతి ఒక్కరి కుటుంబాలలో కలగాలని ఆయన మనసారా కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన షేక్ మస్తాన్‌బి



**పామూరు, జనవరి 14, ప్రభాతవార్త**

పామూరు మండలం ప్రజలకు మండల తెలుగుదేశం పార్టీ మహిళా నేత షేక్ మస్తాన్‌బి సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌బి మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి వేడుకలు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. ప్రతి ఇంట భోగభాగ్యాలు కలగాలని పాడి పంటలు అభివృద్ధి చెందాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలని సంక్రాంతి, కనుమ పండుగలు అందరూ కుటుంబ సమేతంగా ఆనందోత్సవాలతో సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

**వెలిగండ్ల, జనవరి 14, ప్రభాతవార్త**

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన వెలిగండ్లలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ పావని తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రమైన వెలిగండ్ల గ్రామానికి చెందిన కారుమంచి దస్తగిరి వెలిగండ్ల గ్రామానికి సమీపంలోని ఒక నీటి కుంట వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

## ఇర్మియా మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు



**దర్శి, జనవరి 14, ప్రభాతవార్త**

దర్శి మండలంలోని బొట్లపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీనియర్ టీడీపీ నాయకుడు ఇర్మియా(63) గుండెపోటుతో మరణించగా, సమాచారం తెలుసుకున్న దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు బొట్లపాలెం గ్రామానికి వెళ్లి ఇర్మియా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇర్మియా కుటుంబ సభ్యుల్ని పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సందీప్, బాచిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ ఆడిన వ్యవసాయ మిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి



**ముండ్లమూరు, జనవరి 14, ప్రభాతవార్త**

మండలంలోని పూరిమెట్ల గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న పీపీఎల్4 క్రికెట్ టోర్నిలో క్వాటర్ ఫైనల్ మ్యాచ్ పూరిమెట్ల వర్సెస్ నూజెండ్ల పరిచయ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమంలో పూరిమెట్ల ఎంపీటీసీ చింతలపల్లి వెంకటేశ్వరరావు,నిడిగంటి నారాయణ, రమణల ఏడుకొండలు, గ్రామ టీడీపీ అధ్యక్షులు చొప్పరపు నాగేశ్వరరావు, రమణయ్య, శేఖర్, ఫ్రెండ్స్ యూత్ కమిటీ పాల్గొన్నారు.

## గోవుల దాణాకు నగదు విరాళం



**అద్దంకి, జనవరి 14,ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో శ్రీ హరిహర గోశాలకు గోవుల దాణా కొరకు 14 వేల రూపాయల నగదును గోశాల నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావుకు సింగరకొండ దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు మురళీ సుధకారరావు మిత్రబృందం, ఎం.కళావతి, రోటరీ మిత్రులతో 14 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు బాచిన శివధర పూర్ణచంద్రరరావు,అళహరి హరిప్రసాదరావు,చప్పిడివీరయ్య,పూవ్వాడ రామకోటేశ్వర రావు, లక్ష్మీరెడ్డి, ఆంజనేయులు, అంజాద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## సింగరకొండలో ఘనంగా ముగ్గులు పోటీలు



**అద్దంకి , జనవరి 14,ప్రభాతవార్త**

భోగి పండుగ సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ముగ్గులు పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 100మంది పాల్గొనగా, కొల్లి సుజాత మొదటి బహుమతిగా, 10వేలు, రెండవ బహుమతిగా మంజరి 5వేలు, మూడవ బహుమతిగా సుజాత 3వేలు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమం దేవాలయ అసిస్టెంట్ కమీషనర్ ఎం తిమ్మానాయుడు, పాలకమండలి చైర్మన్ మురళీ సుధాకరరావు, ఆధ్వర్యంలో జరుగగా సభ్యులు నూతి ప్రసాద్, వెంకటరత్నం, కోటేశ్వరమ్మ, వేదపండితులు, అర్చక బృందం పాల్గొన్నారు.

## ఆర్టీసి వారి ఆపరేషన్ మేదర మెట్ల అభినందనీయం

### - టిడిపి సీనియర్ నాయకుడు మన్నెరామారావు



**కొరిసపాడు, జనవరి 14,ప్రభాతవార్త**

మండలంలోని వాణిజ్య కూడలి అయిన మేదరమెట్ల బస్టాండును ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఆపరేషన్ మేదరమెట్ల పథకం ద్వారా ఆధునికరించడం అభినందనీయమని టిడిపి సీనియర్ నాయకుడు మన్నె రామారావు అన్నారు. బుధవారం ఆయన తన సన్నిహితులు అనుచరులతో కలిసి బస్టాండ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గత కొద్దిరోజుల నుంచి ఆర్.ఎం. సత్యనారాయణ, డి .ఎం. బి. రామ మోహన్ రావు లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న కంట్రోలర్ సుబ్బరామయ్య ఆర్టీసీ డ్రైవర్ ఆదిశేషయ్య లు బస్టాండ్ కి వచ్చిన నాయకులతో ప్రయాణికులకు ఆధునిక వసతుల కల్పనకై నూతన సీట్లను, రాత్రి సమయాలలో ప్రయాణించే ఆడవారికి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా లైటింగ్ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తున్నా మన్నారు. బస్టాండు మొత్తం రంగులు కూడా వేసి ఆవరణ పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛ బస్టాండ్ లాగా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొందరు ఆకతాయిలు అప్పుడప్పుడు బస్టాండ్లో అల్లరి చేస్తున్నారని ఆయన దృష్టికి తేగా తాను పక్కనే ఉన్నతన ఆఫీసులో ఉంటానని తన దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏది ఏమైనా కొన్నాళ్లుగా సరియైన లైటింగ్ లేకుండా రంగులు వెలసి అపరిశుభ్రంగా ఉన్న బస్టాండ్ ఆవరణ పరిశుభ్రపరచి ఆధునీకరించడం తమ గ్రామస్తులకు ఎంతో సంతోషదాయకమని ఆయన తెలిపారు. ఈ పరిశీలన ఆయన వెంట గ్రామ ఉపసర్పంచ్ మన్నే దుర్గారావు, టిడిపి నాయకులు ఓ గూరివెంకట్రావు, మన్నె పెద్ద అంజయ్య, మన్నే యుగంధర్, మన్నె ప్రసాద్ , బోయపాటి వెంకటేష్, తిరుమల శెట్టి నాగేశ్వరరావు లతోపాటు పలువురు గ్రామస్తులు ప్రయాణికులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి, జనవరి 14, ప్రభాతవార్త**

దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో భోగి మంట వెలిగించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, లలిత్ సాగర్ కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ పల్లె సంస్కృతి, గ్రామీణ కళలు, ప్రజల ఐక్యతను చాటే గొప్ప పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు.ఇలాంటి వేడుకలు నిర్వహించడం ద్వారా యువతకు మన సంప్రదాయాలపై అవగాహన మరింత పెరుగుతుందని తెలిపారు. డాక్టర్ లక్ష్మీ, మహిళలు భోగి మంటల చుట్టు పాటలు పడుతూ భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, పట్టణ టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ(చిన్నా),మాజీ ఎంపీపీ పూసల సంజీవయ్య,కర్ణశ్రీను,ఇత్తడి దినకర్,కనకం శ్రీనివాస రావు, వాసు, దేవతి మహానంది, బొగ్గవరపు సుబ్బారావు, వార్డు కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, మహిళలు శోభారాణి,నాగమణి,అనూష, ఇందిరా, నాగలక్ష్మీ, సునీత, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రాజంపల్లిలో తెలుగు యువ ఆధ్వర్యంలో ట్రాక్టర్స్ రివర్స్ పోటీల కార్యక్రమంలో గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి, జనవరి 14, ప్రభాతవార్త**

దర్శి మండలం రాజంపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం తెలుగు యువ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్స్ రివర్స్ పోటీలు కార్యక్రమంలో పాల్గొన్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి - సుబ్బారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు ఉన్నారు.

## తోలు బొమ్మలాట కళాకారుడు మృతి



**అద్దంకి,జనవరి 15,ప్రభాతవార్త**

పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో బొమ్మలాట కళాకారుడు కోటిలింగాలు బుధవారం మృతిచెందారు. ఆయన మృత దేహానికి స్థానికకౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందించారు.

## నెల రోజులుగా ఆర్‌టిసి బస్టాండ్‌లోనే వున్న కారు

### - డిఎం చొరవతో గ్యారేజిలోకి తరలింపు



**అద్దంకి ,జనవరి 14,ప్రభాతవార్త**

అద్దంకి ఆర్‌టిసి బస్టాండ్ అవరణలో పొదిలి బస్సుల స్టాప్ వెనుక వైపు వున్న ఖాళీ ప్రదేశంలో ఎపి09బిజడ్ 7158 నంబరు కారు గత నెల రోజుల నుండి పార్కింగ్ చేసివున్నది. ఈ కారును ఎవరు పార్కింగ్ చేశారో అనే విషయమై ఆరా తీసినప్పటికీ సమాచారం లేకపోవడంతో బుధవారం స్థానిక ఆర్‌టిసి సిబ్బందిచే ఆ కారును డిఎం అదేశాలమేరకు గ్యారెజీలోకి తరలించారు.

## జాతీయ స్థాయిలో ఎద్దుల పోటీలనే కాదు నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలను కూడా నిర్వహించిన ఎమ్మెల్యే తాటిపర్తి

### - బహుమతుల ప్రధానోత్సవానికి వైసీపీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా



**యర్రగొండపాలెం, జనవరి 14, ప్రభాతవార్త**

సంక్రాంతి సంబరాల్లో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో లక్షల రూపాయల ఖర్చుతో ఎడ్ల పందేలనే కాకుండా నియోజకవర్గ స్థాయిలో మహిళల కోసం మహిళలకు ప్రీతిపాత్రమైన గృహ వస్తు సామాగ్రి అయిన ఫ్రిజ్, వాషింగ్ మిషన్, గ్రైండర్, కుక్కర్, అద్దాల షోకేష్ వంటి విలువైన బహుమతులను ప్రకటించారు. ఈ పోటీలను యర్రగొండపాలెం పట్టణం లోని సాయిబాబా ఆలయం వీధిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దగ్గర రహదారి పైన ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నేతృత్వం లో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌తో కలిసి ముగ్గుల పోటీలలో నెగ్గిన మహిళలకు ఈ బహుమతులను అందజేశారు.

## లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానంలో భోగి వేడుకలు









**అద్దంకి ,జనవరి 14,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండపై వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం లో భోగి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా సంప్రదాయ బద్దంగా హరిదాసులు, కోడిపందెలు, సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామి వారి కరవలంబ స్తోత్రం పఠన పోటీలు జరిగాయి. వీటిలో జి. నగరాజకుమారి,సిహెచ్ సుగణావలి, డి.లక్ష్మీకుమారి, పి. అనురాధలు బహుమతులు గెలుచుకున్నారు. హనుమచాలీసా పోటీలలో నరిశెట్టి లిషిత, శ్రీహిత లు బహుమతులు గెలిచారు. ముగ్గుల పోటీలలో సుజాత, నాగస్వప్నలు వరుసగా మొదటి, రెండు, మూడవ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమాలు దేవాలయ అధికారి మద్దినేని శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో జరుగగా,చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, సభ్యులు కె. వెంకటేశ్వర్లు, బి.సురేష్, తో పాటు పలువురు పాల్గొన్నారు.విజేతలకు ఆయా విభాగాలలో బహుమతులు అందజేశారు.

## లెబర్‌కోడ్ బిల్లు భోగి మంటలలో దగ్ధం



**అద్దంకి , జనవరి 14,ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం కార్మికుల పొట్టగొట్టే లెబర్‌కోడ్ బిల్లును ప్రవేశపెట్టిందని సి.ఐ.టి.యు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆ బిల్లు జి.ఒ.ను బోగిమంటలలో దగ్ధంచేశారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు. మండల కన్వీనర్ తంగిరాలవెంకటేశ్వర్లు కోరారు.ఈ కార్యక్రమంలో కమిటీసభ్యులుపి.ఆదాం, యు.సామ్యేలు, డి.వీరయ్య, అలివేలమ్మ, అంజమ్మ, రాఘవయ్య, జాన్, కోటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ఆధ్వర్యంలో ఘనంగా భోగి వేడుకలు

### - కుటుంబ సమేతంగా పాల్గొన్న వైసిపి ఇన్‌చార్జి





**అద్దంకి, జనవరి 14,ప్రభాతవార్త**

సంక్రాంతి సంబరాలలో భాగంగా బుధవారం తెల్లవారుజామున పట్టణంలోని బంగ్లారోడ్డు సంగం డైరీ సమీపంలో వైసిపి ఆధ్వర్యంలో ఘనంగా బోగి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బోగిమంటను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ కుటుంబ సమేతంగా హాజరు అయ్యారు. సంప్రదాయ బద్దంగా జరిగిన వేడుకలును అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు వైసిపి నాయకులతోపాటు పట్టణ పార్టీ అధ్యక్షులు కాకాని రాధకృష్ణమూర్తి, మండల పార్టీ కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైసిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## సింగరకొండలో ఘనంగా భోగి వేడుకలు



**అద్దంకి , జనవరి 14,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన సమీపంలో బుధవారం ఉదయం బోగి మంటల కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు, వేదపండితుల సమక్షంలో ఆలయ అసిస్టెంట్ కమీషనర్ మదమంచి తిమ్మానాయుడు పాలకమండలి అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకరరావు దంపతులు, సభ్యులు ధూళిపాళ్ళ వెంకటరత్నం తదితరులు బోగి మంటల ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వీరికి అర్చకులు స్వామి వారి తీర్ధ ప్రసాదాలను అందించి అయురాగ్యోలతో వుండాలని భగవంతుని కోరుకుంటూ అశ్వీరదించారు.

## రెండు గ్రామాల ఫీడర్‌ను ద్వారాకనగర్ ఉపకేంద్రానికి అనుసంధానం



**అద్దంకి, జనవరి 14,ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మాయిపాలెం, రామాయిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ విద్యుత్ 200 కన్‌క్షన్‌ల ఫీడర్‌ను అద్దంకి పట్టణంలోని ద్వారాకనగర్‌లో నిర్మించిన 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రానికి అనుసంధానం చేశారు. ఇప్పటి వరకు ఈ ఫీడర్ ముండ్లమూరు మండలం శంకరాపురం విద్యుత్ ఉపకేంద్రానికి అనుసంధానంగా వుంది. దీని కొరకు 3కిలో మీటర్ల 11కెవి లైన్ ద్వారాకనగర్‌నుండి తిమ్మాయిపాలెం, రామాయపాలెం వరకు నిర్మించారు. 120 వ్యవసాయ ఇతర సర్వీసులను 3.5కిలోమీటర్ల లైన్‌తో కలిపి భవిష్యత్తులో విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా ఈ సౌకర్యాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అదేశాలమేరకు కల్పించినట్లు ట్రాన్స్‌కో ఈఈ నల్లూరి మస్తాన్‌రావు వెల్లడించారు. దీని కొరకు 42లక్షలు వ్యయం చేసినట్లు ఆయన వెల్లడించారు. 11కెవి లైన్‌ను సర్పంచ్ అంగలకుర్తి హనుమయ్య ప్రారంభించగా, ఈ కార్యక్రమాన్ని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు ఎం.దామోదర్, ఆర్‌విఎస్ శివప్రసాద్, గ్రామ నేతలు అడుసుమల్లి శ్రీనివాసరావు, పలుపులేటి వెంకటరావు, గండువెంకటరావు, తొట్టెంపూడి సుబ్బారావు, తోపాటు తిమ్మాయిపాలెం, రామాయపాలెం రైతులు, విద్యుత్ వినియోగదారులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గాయం తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

### - ప్రజలందరికి భగవంతుడి ఆశీస్సులు అందాలి - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, జనవరి 14, ప్రభాతవార్త**

తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగ ప్రజలందరికి సుఖ శాంతులు కల్పించాలని టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆకాంక్షించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

